క్లుప్తంగా

ఆలయానికి రూ.5 లక్షలు విరాళం



మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ను సన్మానిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

బండ్లగూడ: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ వెల్లడించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రామాంజనేయ స్వామి ఆలయానికి ఆయన రూ.5 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శనివారం దేవాలయ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం రాము, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘంను బలోపేతం చేయాలి

- మణికొండ రెడ్డి సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి



పంచవటి కాలనీలో సమావేశమైన రెడ్డి సంఘం నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి కులస్తులలో ఐక్యత పెంచి వారిని ఆదుకునేందుకు మణికొండ రెడ్డి ఫౌండేషన్ కృషి చేస్తుందని అధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పంచవటి కాలనీలో రాష్ట్ర రెడ్డి సంఘం నాయకుడు శ్రీపతిరెడ్డి నివాసంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి కులస్తుల పిల్లలకు విద్య, ఉద్యోగాలు, వైద్యం, వివాహాల విషయంలో సహకరించేందుకు ఆయా రంగాలలో నిపుణులైన వారితో కమిటీలు వేయాలని నిర్ణయించారు. ఆయా కమిటీలను సంప్రదిస్తే వారికి సరైన మార్గదర్శకంతో పాటు తక్కువ ఖర్చులో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పేద రెడ్లు ఉంటే వారిని ఆదుకుంటామన్నారు. రెడ్డి సంఘంను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దసరా పండగ మరుసటి రోజు అలయ్ బలయ్‌ని ఈ సంవత్సరం నుంచి నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో కమిటీ కార్యవర్గ సభ్యులతో పాటు అన్ని కాలనీల రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమంగా తీసుకొచ్చిన స్మార్ట్ ఫోన్లు స్వాధీనం



ప్రయాణికుడి నుంచి స్వాధీనం చేసుకున్న స్మార్ట్ ఫోన్లు

శంషాబాద్: అక్రమంగా తీసుకొచ్చిన స్మార్ట్ ఫోన్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టొరంటో నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా అతడి వద్ద 35 సామ్‌సంగ్ స్మార్ట్ ఫోన్లు, ఓ స్మార్ట్ వాచ్ బయటపడ్డాయి. వాటికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో అధికారులు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శనివారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి వర్ష, అర్చన రవి, నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పండుగలకు ప్రత్యేక డిజైన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.



హెచ్‌సీయూకు నిధుల వరద

- అయిదేళ్ల పాటు ఏటా రూ.1000 కోట్లు
- ఆధునిక సౌకర్యాలతో అందుబాటులోకి కొత్త భవనాలు
- రూ.81.27 కోట్ల భవనాలను ఇటీవల ప్రారంభించిన ప్రధాని

2019లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌గా గుర్తింపు



స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్



లెక్చర్ హాల్ కాంప్లెక్స్-3 భవనం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఏటా కొత్త భవనాలు, మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయి. 2019లో హెచ్‌సీయూకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌గా కేంద్ర ప్రభుత్వం యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ సిఫార్సుతో గుర్తింపు ఇవ్వడంతో నిధుల వరద పెరుగుతోంది. ముఖ్యంగా అయిదేళ్ళ పాటు 2019 నుంచి ఏటా రూ.1000 కోట్ల నిధులు ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో కొత్త భవనాల నిర్మాణం ఊపందుకుంది. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ ప్రత్యేక చొరవతో పనులు వేగవంతమయ్యాయి. 2023 ఏడాదిలో పలు భవనాలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా విదేశీ విద్యార్థులకు, ఫ్యాకల్టీ కోసం ప్రత్యేక వసతులతో కూడిన భవనాలు, గెస్ట్ హౌజ్, లెక్చర్ హాల్ కూడా అందుబాటులోకి రావడం విశేషం. కొంతమంది ఉద్యోగులకు కూడా టైప్- ఏ క్వార్టర్స్ నిర్మించారు.



హెచ్‌సీయూలో కొత్తగా నిర్మించిన స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ భవనం

ఈ ఏడాది అందుబాటులోకి వచ్చిన భవనాలు..

- రూ.81.27 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలను ప్రధాని నరేంద్రమోడీ ఆదివారం ప్రారంభించారు.
- హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ (అనుబంధం) భవనాలతోపాటు లెక్చర్ హాల్ కాంప్లెక్స్-3 భవనాన్ని ప్రధాని ప్రారంభించారు.
- రూ.9.43 కోట్లతో హెచ్‌సీయూలో మల్టీ స్టోర్డ్ బ్లాక్ టైప్ ఏ క్వార్టర్స్ నిర్మాణం
- రూ.7.99 కోట్లతో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ హాస్టల్ (50 రూమ్స్) భవనాల నిర్మాణం
- రూ.3.29 కోట్లతో ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ హౌస్ నిర్మాణం
- రూ.2.2 కోట్లతో సౌత్ క్యాంపస్ గెస్ట్ హౌజ్ (పది గదులతో) నిర్మాణం
- స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఇంటిగ్రేటెడ్ భవనం కూడా అందుబాటులోకి వచ్చింది.









ఈ ఏడాది అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి వచ్చిన భవనాలు ఇవే

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



మణికొండ మున్సిపల్ మేనేజర్ రమేష్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

మణికొండ: వేతనాల పెంపు, ఉద్యోగ భద్రతతో పాటు పలు అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు కోరినా ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో సమ్మెకు దిగుతున్నామని మున్సిపల్ కార్మికులు నోటీసు అందజేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న కార్మికులు సీఐటీయూ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ రమేష్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు రూ.21వేల వేతనం ఇస్తుందని , రాష్ట్రంలో మాత్రం కేవలం రూ12వేలు ఇస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు క్రమబద్ధీకరిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. లేదంటే ఈనెల 8వ తేదీనుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం

నార్సింగి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రేఖయాదగిరి



నార్సింగి మున్సిపల్ కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కమిషనర్ సురేందర్‌రెడ్డి

మణికొండ: గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు అభివృద్ధి చెందుతున్నాయని, వాటితో పాటు సమస్యలు పెరుగుతాయని ఎప్పటికపుడు పరిష్కరించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా కృషి చేద్దామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, కమిషనర్ బి.సురేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే నెలల్లో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. కౌన్సిలర్‌ల నుంచి వారి వార్డులలో చేపట్టాల్సిన పనుల వివరాలను తీసుకుని చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిధుల కొరత లేదని రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్నాయన్నారు. అందుకు అనుగుణంగా ప్రజా సమస్యలు తెలుసుకుని ఎప్పటికపుడు అధికారుల దృష్టికి తేవాలన్నారు.

రూ.23.42 కోట్ల పనులకు తీర్మానం

మున్సిపాలిటీ పరిధిలో చేపట్టేబోయే అభివృద్ధి పనుల్లో పార్కుల అభివృద్ధి, శ్మశానవాటికల బ్యూటిఫికేషన్, రోడ్ల బ్యూటిఫికేషన్‌లను రూ.13 కోట్లతో చేపట్టాలని తీర్మానం చేశారు. వీటితో పాటు ఫుట్‌పాత్‌లు, కమ్యూనిటీహాల్ నిర్మాణం, మోడ్రన్ లైటింగ్, పెయింటింగ్ పనులకు రూ. 10.42 కోట్లను ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్, టీపీఎస్ పావనిరావు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుధ్య కార్మికులు సక్రమంగా విధులు నిర్వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్య కార్మికులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనికులు ఎలా అయితే విధిగా యూనిఫామ్ ధరిస్తారో పారిశుధ్య కార్మికులు కూడా విధిగా మున్సిపల్ లోగో ఉన్న యాప్రాన్ ధరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 60 సంవత్సరాలు పైబడిన వారు విధుల నుంచి తప్పుకుని వారి పిల్లలను లేదా కుటుంబీకులను పంపిస్తే వారి స్థానంలో వెంటనే విధులను తీసుకుంటామన్నారు. కాలనీల నుంచి శానిటేషన్ విషయంలో ఫిర్యాదులు వస్తున్నాయని అలా రాకుండా బాగా పని చేయాలన్నారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విధిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ జవాన్లు, స్వీపర్లు, డ్రైవర్లు, కామాటీలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



ఎంజీఐటీ ముందు ఫ్లాగ్ రన్‌ను ప్రారంభించిన అతిథులు

'ఎంజీఐటీ'లో ఫ్లాగ్ రన్

మణికొండ: ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడవేయవద్దని, వాటితో ఫర్నిచర్‌ను తయారు చేయాలనే సందేశంతో గండిపేటలోని మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల నుంచి గండిపేట చౌరస్తా వరకు ఫ్లాగ్ రన్‌ను నిర్వహించారు. రోడ్డు పక్కన పడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హానరీ కన్సల్ట్ జనరల్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ కొరియా ఇన్ హైదరాబాద్ చుక్కపల్లి సురేష్ హాజరయ్యారు. ఎంజీఐటీ ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డితో కలిసి జెండాను ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెప్సికో, జొమాటో, చామోస్ ల సహకారంతో ఈకార్యక్రమాన్ని ద సోషల్‌లాబ్ వారు నిర్వహించటం హర్షనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయటంతో పర్యావరణానికి కలిగే ముప్పును తెలియజేయవచ్చన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై సోషల్ లాబ్ నిర్వాహకులు సందీప్ అరోరా, కాశీ విశ్వనాథన్‌లు వివరించారు. కార్యక్రమంలో పెప్సికో ఉద్యోగులు 600మంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 60మంది, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ, బి.శశిధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి

ఆత్మీయ సమ్మేళనం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజల సహకారంతో గణేష్ నవరాత్రి, మిలాద్ ఉన్ నబీ పండుగలు ప్రశాంతంగా జరిగాయని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం డీసీపీ కార్యాలయం మీటింగ్‌హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని ప్రజలంతా ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించుకుంటూ పండగలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ముస్లిం, సిక్కు మతపెద్దలను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్, వివిధ శాఖల అధికారులు ఏసీపీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు, యాదగిరి, మధు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బతుకమ్మ చీరల పంపిణీ

రాజేంద్రనగర్: బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేసినట్లు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ప్రాజెక్టు అధికారిని రాధారాణి వెల్లడించారు. శనివారం సర్కిల్ పరిధిలోని సెంటర్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో పంపిణీ చేసేందుకు 16 వేల బతుకమ్మ చీరలు అందాయన్నారు. శనివారం మధ్యాహ్నం మరో 14 వేల అదనపు చీరలు సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నాయన్నారు. ఆదివారం అన్ని సెంటర్లు పని చేస్తాయని... మహిళలు ఈ సెంటర్ల వద్ద బతుకమ్మ చీరలను స్వీకరించాలన్నారు. ఆదివారం ఉదయం నుండి సాయంత్రం 5 గంటల వరకు పంపిణీ కేంద్రాలు పని చేస్తాయన్నారు.



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ప్రాజెక్టు అధికారి రాధారాణి

నేడు 'ఆయుష్మాన్ భారత్'

అత్తాపూర్: ఈ నెల 8న చైతన్య విలాస్ రామాలయం ప్రాంగణంలో నిర్వహించనున్న ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకురాలు కొమ్మిరెడ్డి ఉమామహేశ్వరి రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల వనిత దామోదర్‌రెడ్డిలు సూచించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రధానమంత్రి జన్ యోజనతో అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరే ప్రతి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.5 లక్షల వరకు నగదు రహిత ఆరోగ్య సంరక్షణను అందిస్తుందన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామ వార్డుల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామని 18వ వార్డు కౌన్సిలర్ నరేష్ అన్నారు. శనివారం ఆయన తన వార్డు పరిధిలోని హైదర్‌నగర్ కాలనీలో రూ.11 లక్షల మున్సిపల్ నిధులను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వార్డు పరిధిలోని బాలాజీనగర్ కాలనీలో వర్షం కురిసిన ప్రతి సారి ముంపునకు గురయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఆ విషయాన్ని మున్సిపల్ పాలకకమిటీ, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పెద్ద ఎత్తున నిధులను రాబట్టి సమస్యను పరిష్కరించానన్నారు. అదే తరహాలో హైదర్‌నగర్‌లోను మురుగు, వరద నీటి సమస్య పరిష్కారానికి పనులను చేపడుతున్నామన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మైలార్‌దేవ్‌పల్లి కాటేదాన్ కల్లు కంపౌండ్ సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి (70)మృతి చెందాడు.స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటన స్థలికి వచ్చి విచారించగా సమాచారం తెలియలేదు.పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

మేకలు చోరీ

మైలార్‌దేవ్‌పల్లి : మేకలను ఎత్తుకెళ్లి సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు మైనర్‌లను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన ఇద్దరు స్నేహితులు మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మిగూడలో మేత మేస్తున్న 15 మేకలను ఆటోలో ఎత్తుకెళ్లారు.మేకల కాపరి చూసేలోపు పరారయ్యారు. మేకల కాపరి ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్



అన్నదాన మండపాన్ని ప్రారంభిస్తున్న అంజన్‌కుమార్‌గౌడ్

మణికొండ: మన ప్రాంతాలలో ఇప్పటికే ఉన్న పురాతన ఆలయాలతో పాటు కొత్త ఆలయాల నిర్మాణాలకు ప్రతి ఒక్కరు కదలి రావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, సంకటహర హనుమాన్ దేవాలయ కమిటీ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, మైహోం అవతార్ పక్కన ఉన్న సంకట హర హనుమాన్ దేవాలయంలో నిర్మించిన అన్నదాన మండపం, అన్నపూర్ణ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. అన్నదాన మండపాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ దైవారాధనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణస్వామి ముదిరాజ్, నందు శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాజు, అశోక్, శ్రీనివాసులు, కోటేశ్వర్‌రావు ,పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు



క్రీడాకారులను అభినందిస్తున్న నాయకులు

బండ్లగూడ: చిన్నారులకు చిన్ననాటి నుంచే క్రీడల్లో ఉత్తమ శిక్షణ అందిస్తు వారి ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రేమ్‌గౌడ్, సురేష్‌లు సూచించారు. శ్రీ రాఘవేంద్ర స్పోర్ట్స్ ఎస్టేట్ క్రీడాకారులు దుబాయ్‌లో జరిగే అండర్-15 గోల్ఫ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు జశ్వంత్, శాన్వి, వేదాంత్, అపూర్వ్, రితిక్, విగ్నేష్‌లు సెలక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను గ్రౌండ్ ఓనర్ రఘుగౌడ్, హెడ్ కోచ్ పి.ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబాయ్(యూఏఈ) టూర్ అండర్-15 టీమ్‌లో పోటీ చేసేందుకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. గోల్ఫ్‌కప్ క్రికెట్ టోర్నమెంట్‌లు ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కొనసాగుతున్నాయన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

శారదాధామంలో క్రీడా పోటీలు

బండ్లగూడ: శారీర దారుఢ్యానికి, మానసిక వికాసానికి క్రీడలు ఉపయోగపడతాయని ప్రముఖ పారిశ్రామికవేత్త కె.అనిల్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలో విద్యాభారతీ దక్షిణ మధ్యక్షేత్ర ఖేల్‌కూద్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర శిశు మందిర బాలబాలికల వ్యక్తిగత క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశుమందిరాలు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యా భారతీ దక్షిణ మధ్యక్షేత్ర కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణ్‌రావు, సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌రావు, విద్యా భారతీ ఆంధ్రప్రదేశ్ సంఘటనా కార్యదర్శి భాస్కర్, భాగ్యనగర్ విభాగ్ అధ్యక్షులు సింహాద్రి సూర్యనారాయణ, సుధా చల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్